
# గౌరమ్మ

ఎ. అప్పల్నాయుడు

**"నోమి నోమన్నలాలో - తుమ్మెదలో నోచినమ్మా - రుద్రవేణీ - తుమ్మెదలో" పాట ఆవేటి మాసపు గాలిలో - పొలాల మీద నాట్య మాడుతోంది. నున్నగా నొల్లదోలిన బురదమళ్లలో - పొత్తిళ్లలో చంటిపాపల్లా సన్నగా తల లూపుతున్నవి... వరినాట్లు! వరినాట్లకీ, బురదకీ మధ్యలోని నీరు గాలికి కెరటాలు వేయాలని ప్రయత్నించి - పల్లానికి జారుతోంది.**

తలల మీద ఊడుపు గొడుగుల్తో వొంగొని - నాట్లేస్తోన్న ఊడుపు గత్తెలు భూమాతను ప్రార్థించే భక్తుల్లా ఉన్నారు. ఊడుపుగత్తెల వెనక నిలుచున్న గౌరమ్మ... గళం విప్పి 'తుమ్మెదలో పాడుతోంది. ఊడుపుగత్తెల్లో ఇద్దరు ఆ పాటకు వంత కలుపుతున్నారు. పాడుతూ, పదం, పదమూ యెత్తుకుంటూ అడుగులు వెనుకకు వేస్తోంది గౌరమ్మ..। ఊడుపు అవుతుంటే. బురదలో నాట్లు వేస్తోన్న ఊడుపు గత్తెల గాజుల గలగలలూ; వారి





అడుగుల చప్పుడూ, నీటి బుడగల శబ్దమూ... వాద్యాలుగా.. గౌరమ్మ పాటలో కలుస్తున్నవి. వచ్చని పొలాల మీద పాట పరుగెడుతోంది. ఊడువు - పాటతో పాటూ నడుస్తోంది.

ఊడువు జరుగుతోన్న ఆ మడిగట్టు అవతల జోరి పొలమూ - ఛైర్మన్ గారిదే. జోరి పొలం దమ్ము వడుతున్నారు. రాత్రి కురిసిన వర్షం... తూర్పు మబ్బుల్ని కడిగేసింది గాబోలు - ఎండ ఎర్రగా తగుల్తోంది. దమ్ము వడుతోన్న పశువులు జాపోసి పోతున్నవి. చెమటల్తో - రైతుల ఒంటి మీది బనీన్లూ, గావంచాలూ తడిసి ము ద్దయిపోతున్నవి. గట్ల మీద ఆరుద్ర పురుగులు బొరియలలోకి దూరుతున్నవి. తూరీగలు - గడ్డిపూల మించి, తువ్వలలోని ఆకుల చాటున రెక్కలు ముడుచుకుంటున్నవి. మెరక మీద కాకులు - మళ్ల గట్ల మీద రైతు లుంచిన అంబళ్ల తపేళాల వైపు రావటం - తపేళాల మీది గొడుగు మూతలను పొడవటం - అదిలిస్తే యెగిరిపోవటం!

'తుమ్మీదలో పాట నగాని కొచ్చింది. ఊడువూ నగం పూర్తయింది. ఊడువు గత్తెల్లో ఇద్దరు మునలమ్మలు నిల్చొని, నడుము సాగదీసి గట్టు మీదకి వెళ్లారు. గట్టు మీద అగ్గిబెంటుతో మరో ఊడువు గొడుగుల్లోని చుట్టల్ని అంటించేరు. వారి చుట్ట పీకలను తాకించి మరో ఇద్దరు చుట్టలు వెలిగించు కుంటున్నారు. అలా ఒకరి నోట్లో చుట్టతో - ఎదురుగా నిల్చొని మరొకరు నోట్లో చుట్టను అంటించటం రెండు చిలుకలు మూతులు కలిపినట్లుగా కన్పిస్తోంది. అంత, చుట్టలు కాల్చటంలో పడి కొంత సేపు ఊడువు ఆగింది.

ఊడువు ఆగటాన్ని పాట ఆగిపోవటంతో గ్రహించిన సింహాచెలం, వక్క జోరి పొలం నుండి - ఊడువు మడి గట్టెక్కి -

"ఔనర్రా, ఒర్రె ఊడువులోల్లో! నుట్టలు కాల్చడమేనా - ఊడువుడ్డ ముందా? ఇంకా ఈ మడి నగానికేన అవలేదు. మరి, జోరి పొలాని కెపుడొస్తారు? నెండి, నెండి, బేగి నెండి. సేర్మేనుగోరు వొత్తంద్రాట" అని కేకేశాడు.

ఆ కేకకు చుట్ట కాల్చుతున్న ఓ మునల్ది నోట్లో చుట్ట అడ్డ పొగ నుంచి తీసి "అయితేటంతావురా? కాదేటంతావురా? నుట్టముక్కలేన కాల్చనివ్వవేటి? కాదు, మీ సేర్మేను మరేటి యెననం సెయ్యిడేటి?" అని ముదలకించింది.

"అఁఆఁ... ఆల సేర్మేను గోరు సీకటి పడిందాకేటీ ముట్టుకోడు.." అని హాస్య మాడింది మరొకామె. ఆ మాటకు మిగిలిన వాళ్లు గొల్లున నవ్వేరు.

ఆ నవ్వులు ఛైర్మన్ గార్ని అవమానించినట్లుగా భావించిన సింహాచెలం "ఆ బాబు సీకట్లో సేసినా సెల్లుతాది, ఎలుగు మీద సేసినా సెల్లుతాది. ఎవులడగ్గల్రు? మీ రడగ్గల్రా? మీ రడ్డగల్రా?" అని ఛైర్మన్ గార్ని వెనకేసు కొచ్చేడు.

"... సెల్లి నన్నాళ్లూ నీకూ సెల్లిపోద్ది. మీ బాబుకీ సెల్లిపోద్ది. ఎద్దు ఎల్లకాలం వొక పక్కే తుంగోదు. అది మారిన్నాడు నూడాల మీ సెల్లుబాటు" అని గుత్తగత్తె గౌరమ్మ జవా బిచ్చింది.

ఆ జవాబుకు సింహాచెలం -

"కాదు, కాదేటి మీ ఉద్దేశం" అంటూ గట్టు దిగి, పొలంలోకి రాబోతే దూరంగా కన్పిస్తోన్న జీపు వైపు వేలు చూపిస్తూ -

"... అద్గద్గో వడుకు గోర్జి కాడ జీపీ తిరుగుతంది. ముందెల్లి, ఆ మడి దమ్ము వని కానీయి. సేర్మేను బాబొచ్చేత్తండు. ఆ బాబొచ్చీ నరి కింకా ను వ్విక్కడుంటే దుమ్ము దులిపీగల్డు నీకు. ఎల్లెల్లు" అని వెళ్ల మంది గౌరమ్మ. ఆడవాళ్లంత మళ్లీ గొల్లున నవ్వేరు.

"ఆడమంద - నోటిల నోరు బెట్టలేం" అని గొణుక్కొని జోరి పొలానికి పరుగెత్తాడు.

"లేర్రా... మునుం వట్టండి. అంబళ్లకి అయిపోవా లీ మడి" అని గౌరమ్మ కేకేసింది.

అంత మునుం వట్టారు. చిక్కని బురదలో - వచ్చని నాట్లు నిలబడి తల లూపుతూ ఊడువు గత్తెలకు కృతజ్ఞతలు చెప్తోన్నవి.

ఛైర్మేన్ గారి జీపు ఊడువు మడి దోవ తిన్నగా రాబోతుండగా గౌరమ్మ దోవ దగ్గరకు చేరింది. దోవకు మధ్యలో కంచువళ్లెంలో 'వరిదుబ్బు' వసువు రాసి ఉంది. అక్షింతలు వళ్లెంలో ఉన్నాయి. ఆ వళ్లెం అందుకొని గౌరమ్మ ఛైర్మేన్ జీపు ఆపి -

"గయిరమ్మ బావ్... గయిరమ్మ" అంది.

ఊడువు మడిలో ఊడువు గత్తెలు 'ళళళళో అంటూ ఉలవలు పోశారు. ఛైర్మేన్ గారు నవ్వుతూ, జేబులో చెయ్యి పెట్టారు.

"సిల్లర గిల్లర సాల్దు. పెద్దోలు మీరే సిల్లరేత్తే - మీ యెనక నున్నోలు ఇంకేటేత్తారు?" అంది గౌరమ్మ - జీపు వెనక సీట్లలో కూర్చున్న వారి దగ్గరా దక్షిణ లాగాలని.

"... నిన్ను నూత్తేనే సిల్లర్రాదే గవిరీ" అని వళ్లికిలించి నవ్వేడు నత్తెం నాయుడు. ఛైర్మేన్ గారు గౌరమ్మ వైపు చూశారు.

ముఖం నిండా వసువు రాసి స్నానం జేసిందేమో - వచ్చగా మెరుస్తోంది నిండుగా మొహం. నుదుటి మీద కుంకుమ బొట్టు చిరు చెమటల్లో చిన్నగా చెదుర్తోంది. అరబోసిన ముంగురులు - ముఖం మీదుగా సీకాయ వాననను వరుస్తోన్నవి. కాటుక కళ్లు... కడిగిన ముత్యాల్లా మిలమిలా మెరుస్తోన్నవి.

గౌరమ్మ నూటిగా నత్తెం నాయుడ్ని చూస్తూ -

"మనవరాలు ఊడుదీరి యాదిల గెంతుతున్నే - నీకు వులువు తగ్గలేదు. బుర్రకి వట్టిన బుద్ధి - నీకు పుడకల్తోటి పోవాలి గాని, పులిమితే పోదు" అని చురక అంటించింది.

"వొరన అవుతావని యుగటమాడుంతాడు. ఆ మాత్రానికే నీ యందం సిమిడిపోదునేయే" అని, మరొక నాయుడు నత్తెం నాయుడుకి నపోర్టు వచ్చేడు.

"... ఇగటాలేన, రూపాయిలు యేసిన మొకా లున్నాయే?" అని మళ్లీ దెబ్బగొట్టే నరికి - నోళ్లు మూసి చేతులు జేబుల్లోకి దూర్చారు.

వళ్లెంలో దక్షిణ వడింది. మడిలోంచి మళ్లీ ఆడోళ్లు ఉలవలు పోశారు. వళ్లెం దోవలో ఉంచి, గౌరమ్మ మడిలో కొచ్చి పాట అందుకుంది.

'వరిదుబ్బు'కు పూజ చేసి, వసువూ, కుంకుమ రాసి వళ్లెంలో పెట్టి దాన్ని పొలం ముందు గల రోడ్డు మీద పెడతారు. 'గౌరీదేవత' పూజ కోసం ఉడువుల రోజులు ఇలా దక్షిణలు దండుతారు. త్రోవలో పోయే ప్రతివారూ - 'గౌరీదేవత'కు దక్షిణ వేయాల్సిందే - లేకపోతే ఉడువులోళ్లు - వొక వట్టాన వదలరు.

ఈ దక్షిణ డబ్బుతో - గౌరీ పౌర్ణమి ఉత్సవం చేస్తారు. ఆడవాళ్లకు గౌరీ పౌర్ణమి నోము యెంతో



—చిత్రం: ఎ.వి.ఎస్.ఆర్. ఆచార్యులు, గుంటూరు

విశిష్టమైనది. చాలా నమ్మకంతో, నిష్ఠతో పౌర్ణమి చేస్తారు. అయిదు రాత్రులు 'గౌరమ్మ' పాటలు పాడి - పౌర్ణమి తెల్లవారి గౌరమ్మ విగ్రహాన్ని 'నాగావళి' నదిలో అనుపుతారు.

ఉడుపు గుత్తగత్తె గౌరమ్మే - గౌరీ పౌర్ణమి ఉత్సవాలకూ నిర్వాహకురాలు. గౌరమ్మ చేతుల మీదుగా అన్నీ జరగాలని - కోరుకుంటారు ఆడ కూలీలు. గౌరమ్మకు కూలినాలి జనాల్లో అంత విలువ ఉంది.

గౌరమ్మ పాట పాడితే నాగావళి గలగలలు విన్పిస్తాయి. రెల్లు పొదలు ఆహ్లాదంగా ఊగుతాయి. గూటిలో గువ్వలు గునగునలాడుతాయి.

"యే తీరూ గున్నదమ్మా - తుమ్మీదలో
రుద్రవేణీ - యందామూ తుమ్మీదలో
కోవెలలో - పెడితేనే తుమ్మీదలో
విగ్రహ మనుకుందురమ్మా తుమ్మీదలో
వనములో ఉంచితేనూ తుమ్మీదలో
దేవతనూ కుందురమ్మా తుమ్మీదలో" పాట నాట్ల మీద నాట్య మాడ్తోంది.

అంబళ్ల వేళకు ఉడుపు పూర్తయింది. మడి గట్టెక్కి; కాళ్లూ చేతులూ కడుక్కొని అంబళ్లు తిన్నారు. ఓ క్షణం గట్టు మీదనే కూర్చొని, చుట్టలు కాల్చి, నోళ్లు చుట్టలూ, పేలు చూసుకునే వాళ్లు పేలూ చూసుకున్నారు. గుత్తగత్తె గౌరమ్మ కేకతో - అంత మళ్లీ ఉడుపుకి దిగారు. ప్రక్క జోరి పొలంలోకి. గౌరమ్మ, ఈ సారి "గాజులో డన్నయ్యా" పాట యెత్తుకుంది.

ఛైర్మేన్ గారు జోరి పొలం ఉడుపు చూసేరు. గట్టు మీదనే చుట్టూ పొల మంత తిరిగారు. కొంత సేపయ్యాక, ఎవరో పట్నపాయన వస్తే - ఆయనతో పాటూ జోరి పొలం యెగువ నున్న మామిడి తోటలోకి వెళ్లిపోయారు.

ఛైర్మేన్ గారు పట్నంలోనే యెక్కువగా ఉంటారు. పొలం పను లప్పుడూ, నూర్పు లప్పుడూ ఊరిలో గల భవంతిలో ఉంటారు. ఆ ఉన్న నాలుగు రోజులూ - పట్నం నుండి యాత్ర కొచ్చేట్లుగా ఛైర్మేన్ గారి కోసం పట్నం వ్యాపారులూ, కాంట్రాక్టర్లూ, బదిలీలు కావలసిన ఉద్యోగులూ, బదిలీలు ఆపుచేయించు కోవాలనుకునే అధికారులూ, నిరుద్యోగులూ, గ్రామాల పెద్దలూ... వస్తుంటారు. ఛైర్మేన్ గారు భవంతిలో ఉంటే భవంతికీ, పొలంలో ఉంటే పొలానికీ, తోటలో ఉంటే తోటకీ - పరిగెడతారు వచ్చే వాళ్లంత !

పొలంలో ఉన్న ఛైర్మేన్ గారి దగ్గరికి - ఈ రోజు బాగానే జనం వచ్చారు. వచ్చిన వాళ్లందరికీ 'గయిరమ్మ తల్లి'ని చూపి దక్షిణ దండింది గౌరమ్మ. పళ్లెం నిండింది డబ్బుల్తో.

సాయంత్రానికి ఉడుపు పూర్తయ్యింది. ఊడుపు గత్తెలు గట్టెక్కి; ప్రక్క కాలువలో కాళ్లూ, చేతులూ కడుక్కుని చీర కొంగు ముడులు విప్పి, సర్దుకుని - ఇళ్లకు బయల్దేరారు.

గౌరమ్మ - "మీరు పదర్రా. సేర్మేన్ గోరు తోట లున్నారు. కూ ల్లడిగి తీసికొస్తాను" అని చెప్పి తోట వైపు నడిచింది.

పొద్దు వాలబోతూ - ఎండ తోట కొసంచున ఉంది. చెట్ల నీడలు నేల మీద కదుల్తున్నాయి పొడుగ్గా. తోట మధ్యలో - వాలు కుర్చీలో ఛైర్మేన్ గారూ, ఎదురుగా అల్లిక కుర్చీలో పట్నం బాబూ - కూర్చొని ఉన్నారు. వారి మధ్య స్టూలూ, దాని మీద పళ్లెంలో వేరుసెనక్కాయలు వేపినవీ ఉన్నాయి. వేరుసెనక్కాయల్తో కబుర్లు చెప్తూ - పగలబడి నవ్వుతున్నా రిద్దరూ !

నవ్వుతోన్న ఇద్దర్నీ చూసి ఆగిపోయింది గౌరమ్మ. గౌరమ్మ నీడ ఛైర్మేన్ కుర్చీ ముందు వాలగా చూసిన ఛైర్మేన్ -

" - యేం వక్కడే ఆగిపోయావు ? రా, రా" అని పిల్చి; గౌరమ్మ రాగా - "ఉడుపయి పోయిందా ?" అ నడిగేరు.

"అవకపోతే ముసు మొదిలి లెగుత్తామేటి ?" ప్రశ్నతో జవా బిచ్చింది గౌరమ్మ.

"అడిగిన దానికి జవా బివ్వకపోవటం - పల్లెటూరి వాళ్లకి అలవాటా ?" ఇంగ్లీషులో అడిగేడు పట్నం బాబు ఛైర్మేన్ని. ఛైర్మేన్ చిన్నగా నవ్వి -

"అనవసర ప్రశ్నల్ని - యెద్దేవా చెయ్యటం వారి ప్రత్యేకత" అన్నారు.

"... మరి, అనవసర తతంగా లెన్నో చేస్తారు. ప్రతి దానికీ పండగలూ, విందులూ, వినోదాలూ చేస్తారు. వాటి సంగతో ?" ఖండించేడు పట్నంబాబు.

"... అదీ; లాభమా, నష్టమా అని గుణించే వాళ్లకు అర్థంకాని కల్చర్" అన్నారు ఛైర్మేన్ గారు.

ఇవేవీ అర్థంగాని గౌరమ్మ - వారి ఆంగ్ల సంభాషణ మాత్రం తన గురించే అని గ్రహించింది. ఇక, అలా నిలబడలేక -

"... మా ఉడుపు కూల్లు..." అంది గౌరమ్మ.

"ఇక్కడ నా దగ్గ రేమున్నాయి ? బంగళా కొచ్చి ఇస్తాను, పదా" ఛైర్మేన్.

"మీ రెపుడి కొస్తారు. మా కెపుడిస్తారు. బత్తే లెపు డవుతయి మాకు" గొణిగింది గౌరమ్మ.

"మరీ 'అంత ఘోరమా ?" ఆశ్చర్యబోయింది అల్లిక కుర్చీ.

"పూట బత్తెం పుల్లవెలుగు బతుకులు బావూ మావి" అంది గౌరమ్మ.

"సరే, పదా - నీ కంటి ముందే జీపులో వచ్చేస్తాం" అని పంపేసారు ఛైర్మేన్ గారు. గౌరమ్మ వెనుదిరిగింది.

"... యెంత మందినో చూశాం గానీ - ఈ నేచురాలిటీ లేదు గదా ? ఆమె జూడు - యెంత నేచురల్గా ఉందో ? ఆ చెదిరిన కుంకుమా, ఎండకు వాడిన పసుపు పచ్చని మొహం, వీడీ వీడని జుత్తుముడీ, ఆ చీర కట్టును తన్నే నడుమూ... ఐ లైక్ దట్ ఒరిజినాల్టీ" అన్నాడు పట్నం బాబు.

"అంతవరకే ! ఇక ముందుకు సాగొద్దు. ఎవరికీ లొంగని గుర్రం. స్వారీకి సరదాపడ్డ - ఒక రిద్దరు రైతులకి పరాభవమైంది. ఆమె దగ్గర అందరికీ భయమే" అని హెచ్చరించేరు ఛైర్మేన్ గారు.

ఆ హెచ్చరికకు అల్లిక కుర్చీ బాబు - స్టూలు

కింద నున్న విస్కీ బాటిల్ బయటికి తీసి ఓపెన్ చేశాడు. పొద్దు పూర్తిగా వాలిపోయింది. మామిడి తోట - చీకటిలో మునిగిపోయింది.

*** *** ***

ఛైర్మేన్ గారి బంగ్లాలో - బల్బులు భయం భయంగా వెలుగుతున్నవి. బంగ్లా గేటు దాటి, వరండాలో కొచ్చిన గౌరమ్మను సింహాచలం ఆపేస్తూ -

"ఉండుండు... బాబొచ్చిసాడు. డబ్బులడిగిసొత్తాను" అని లోన కెళ్లాడు. గౌరమ్మ బంగ్లాను ఆశ్చర్యంగా చూడసాగింది. రెండతన్తుల బంగ్లా అది. ఎన్నో గదులు! ఏ గది నుండి యే గదికి తోవ ఉందో కొత్త వారికి తెలీదు. అన్ని గదుల తలుపులూ విద్యుత్ కాంతిని మూసేస్తున్నాయి.

"ఇదా. నూటిరవయ్యీ" డబ్బు తె చ్చిచ్చేడు సింహాచలం.

"నూటిరవయ్యే? యేమీ?" గౌరమ్మ.

"యేమో" సింహాచెలం.

"ఎకరానికి ఎనభయి లెక్కన - మీ రెండకరాలకి ఎంతవుతాది?"

"అదేమో."

"యే టదేమో? తిన్నగ మిగిల్న నలభయ్యీ తెచ్చియ్యి" అని గద్దించింది గౌరమ్మ.

"నే నెక్కడ తెచ్చిత్తాను. సేర్మేన్ గేరంతే ఇచ్చేరు."

"అయితెల్లి, ఆ బాబునే అడిగి వట్రా" గసిరింది గౌరమ్మ.

సింహాచెలం విసుక్కుంటూ లోన కెళ్లాడు. గౌరమ్మ అసహనంగా నిల్చుంది.

ఓ క్షణం తర్వాత ఛైర్మేన్ గారు వస్తూ -

"యేఁవీ? లెక్క చాల్లే దంటున్నావట?" అని ప్రశ్నించేరు.

"యెవుడూ కొత్తేనేటి మీకు? ఎకరాకి ఎనభయి కాదా?" గౌరమ్మ అడిగింది.

"ఆ లెక్కనా? నిజమే గానీ - ఈ రోజు గౌరమ్మ దక్షిణ ఎం తొచ్చిందీ?" అడిగేరు సేర్మేన్ గారు.

"యేమో, ఇంకా లె క్కెయ్యిలేదు."

"పోనీ - ఇంచుమించుగా చెప్పు."

"కాదా.. సొమ్ము నంగ తెందుకూ?" అనుమానంగా అడిగింది గౌరమ్మ.

"ఈ రోజు నా కోసం ఓ ముప్పయి మంది దాక వచ్చి ఉంటారు. అందరూ, మీ గయిరమ్మకు దక్షిణ వేశారు. నేనే చెప్పి వెయ్యించేను. ఔనా?" అనడిగేరు ఛైర్మేన్ గారు.

ఎందుకు చెప్తున్నారో గ్రహించలేని గౌరమ్మ - "ఔను.." అని వొప్పుకుంది. అప్పుడు -

"వా ళ్లేసిన దక్షిణ నూర్రూపాయలు దాటి ఉంటాది. అంత సొమ్ము మీ కెపుడేనా దక్షిణ వచ్చిందా? వచ్చి ఉండదు. నేను అక్కడ ఉండటం వల్లనే వచ్చింది. నా వల్ల మీకు లాభ మొచ్చినప్పుడు - నాకు మీరూ లాభం చూపాలి గదా! అంచేత ఎకరా అరవయి రూపాయిల లెక్కనే నాకు ఉదువు లివ్వాలి. ఆ లెక్క మీద నూటరవయి ఇచ్చేను" అని అసలు విషయం వివరించేరు ఛైర్మేన్ గారు.



**చుట్టాలు**

సుబ్బారావ్ పాపారావ్‌తో మాట్లాడుతూ "ఏవోయ్ పాపారావ్! మొన్న అటు మొన్న నిన్న మీ ఇంటి కొచ్చిన చుట్టాలు ఎవరు?" అని ఆరా తీశాడు.

చుట్టాల వివరాల గురించి అతనికి తెలియ చేశాడు పాపారావ్.

"ఇన్ని చెప్పావు గాని ఇంతకీ మీ ఇంటి పేరు ఏమిటోయ్!" అన్నాడు సుబ్బారావ్.

వెంటనే "చుట్టాల" వా రని చెప్పి అప్పుడే వచ్చిన తన చుట్టాల్ని లోపలికి ఆహ్వానిస్తున్నాడు పాపారావ్.

ఎం.అప్పాజీ [తెనాలి]

గౌరమ్మ ఆ మాటకు ఆశ్చర్యపోయింది. ఛైర్మేన్ చెప్పిన కన్సెషన్ సిద్ధాంతం విని - "ఓర్నాయ్య సిన్నింటోడివి గాదురో. దేవుడి గుడిల దీవమార్పేసి దేవుకొనే గండడివిరో" అనుకుంది. "ఈ దక్షిణ సొమ్ము ఎరవేసి - మొత్తం యీడి తాలూకా యాభయి ఎకరాల పొలానికీ - ఎకరా కిరవయి లెక్కన - ఓలమ్మో! ఎయ్యి రూపాయిలు! ఎయ్యి రూపాయిలు మింగిడానికి నూత్తన్నావురా ముంగిపోతా" అని గ్రహించింది గౌరమ్మ. గ్రహించేక -

"అది గయిరమ్మ నంబరానికి... మాం నర్దుకోడానికి కాదు" అని దక్షిణ సొమ్ము ఎంతయినా - కూలీలకు సంబంధం లేదని చెప్పింది; నంబరం కోసమే అంది.

"కాదు నీ వాద వేఁవిటీ?" వినుగు ప్రదర్శనకు దిగేరు ఛైర్మేన్ గారు. అలాంటి ప్రదర్శనకు కూలీలు భయపడి పోతా రనే సైకాలజీ గ్రహించి. కానీ గౌరమ్మ ఆ సైకాలజీకి అందనిది. అందుకే, కరుకుగా -

"వో దవేఁటి? ఫోదవ్ఁ? కూల్లు తగ్గించేసి కవుర్లు మీరు సెప్తన్రు. తిరగ వోదవఁంతా రేటీ? ఎనభయి లెక్కన - కూల్లు ఇచ్చేయండి, వోదవ్ఁ గీద వొద్దు" అంది.

ఆ మాటకు ఛైర్మేన్ కొద్దిగా అహం దెబ్బతిన్నట్టు పీలయినా - సర్దుకుని, మేస్త్రీలకు కమీష నిస్తే లొంగుతా రనే మరో సైకాలజీ థీరీ లొంచి ఆలోచించి "రైతుల్తో - అటూ ఇటుగా సర్దుకుపోతే - బాగుపడతావు" అని ఉపోద్ఘాతం చెప్పారు.

అది ఎటు దారి తీసుకెళ్తాదో తన కనవసరం - అని భావించి గౌరమ్మ - ఛైర్మేన్ ఉపోద్ఘాతానికి ఉలకా, పలకా లేదు. అయినా "ఇప్పుడు నే నడిగిన ఇరవయి రూపాయిల కన్సెషన్‌ల... పది నీదీ, పది నాదీ చేసుకుందాం. యేఁవంటావు" అని ఎరవేశారు ఛైర్మేన్ గారు.

ఆ ఎర అర్థం అయ్యేసరికి, కోపం నసాళాని కెక్కింది గౌరమ్మకు. మనిషి ఊగిపోతూ - "నాకు ఎంగిలి కూడు జల్లుతావా? నన్ను నమ్మి, నా యెనకాల వొచ్చి, నడుము లొంచి పన్జేసీ వోల్ల నోల్లు కొట్టమంతావా? అది నువ్వూ, నేనూ సర్దుకుందామంతావా? త్పూత్! మీ బుద్దులు.. బుగ్గయిపోను!

"మీరు ఇలాగే కమీసన్ల కింద సంపదంత సర్దుకోబట్టే - కుదబలిసిపోనారు మీరు, పెజలు మాత్రం సిదిగిపోనారు.

"నా కేటి ఊళ్లేలాలనీ, మేడలూ మిద్దిలూ కట్టీయా లనే లేదు. నీలాటి బుద్ద లుంటే - నన్ను నమ్మినోలు ఈనాడు గాపోతే మరోనాడు నోటిల ఊసెత్తరు. ఊస్సినా... తుడిసీసికుని బతకటం మీ కలవాటు గానీ - నాక్కాదు. మా కూల్లు మాకు మరియేదగిచ్చీయండి" అని జలకడిగీసింది గౌరమ్మ!

ఆ దెబ్బకు ఛైర్మేన్‌లోని లౌక్యమూ, నటనా, ముసుగూ అన్నీ తొలగిపోయాయి. ఆస్తీ అధికారం ఇచ్చిన అసలు సిసలు అహంకారం బయటికొచ్చి -

"కా దేటీ నీ సీలుగుడు? మర్యాదగా మాట్లాడానవా? నీ దిక్కున్న దగ్గర చెప్పుకో... పైసా ఇవ్వను. అసలు, ఇక నువ్వు మా పొలాలు ఉడిపించొద్దు. కూడు జల్లితే కాకులు కరువు గాదు. నోర్మూసుకెల్లు. లేపోతే గెంటింపించీ గల్ను జాగ్రత్త" అని కేకల్లోకి దిగేరు.

గాలీ, వోనని చూసి నిలబడిన గరిక దుబ్బులా గయిరమ్మ నిబ్బరంగా నిల్చొని, చూపుడు వే లెత్తి - " సూద్దుం, సూసీద్దుం. కూడు జల్లితే కాకులు కరువు కాదా? అదా నీ నిబ్బరం. అదీ సూసీద్దుం.

" ఈ ఇలాకాల - ఈ గౌరమ్మ గుత్త కట్టిన తర్వాత నన్ను కాదని యే గుత్తగత్తె ఉడుత్తదో నానూ సూసెత్తను. నీ పొలాల.. నాటు వొక్కటంతే... వొక్కటి పడితే - ఇది గంగాడేల బొట్టీ కాదు, అట్టాడేల కోడలూ గాదు! ఆఁ!

" నువ్వే... నెక్కబెట్టి ఎనభయి లెక్కన కూల్లు ఇచ్చీ రోజు వొస్తాది. అంత దాక ఈ నూ టిరవయ్యీ నువ్వే ఉంచు" అని సింహాచెలం అందించిన నూటిరవయి రూపాయిల్ని విసిరికొట్టింది.

నోట్లు ఛైర్మేన్ ముందు చెల్లా చెదురుగా ఎగిరాయి. అక్కడకు చేరిస సింహాచెలాన్ని తోసేస్తూ - గౌరమ్మ విసురుగా ఊర్లోకి నడిచింది.

జుత్తు ముడి విడిపోయి నడుస్తోన్న గౌరమ్మ - పూనకం బట్టిన "గయిరమ్మ తల్లి"లా కనిపించింది సింహాచెలానికి! భయంతో "తుఫ్, తుఫ్" మని గుండెల మీద ఊసుకున్నాడు సింహాచలం.

సరిగ్గా అప్పుడే కరెంటు ఆగిపోయి - బల్బులన్నీ ఆరిపోయాయి.

చీకటిలో బంగ్లా మిగిలింది. నోట్లూ, లైట్లు వెలిగించలేవు.

"లాంతరు ముట్టించరా... సిమ్మిగే" అని సింహాచెలాన్ని కేకేశారు ఛైర్మేన్ గారు.

సింహాచెలమో, మరొకడో - కూలీ నాలీ - చేయలేనిదే ఆ బంగ్లాకు వెలుతురూ రాదు, బంగ్లాకు చలనమూ రాదు!